ఈనాడు

Date: 07/02/2023

# మెట్రో మరింత పరుగెత్తేలా..

## ప్రాజెక్టులకు రూ.2500 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. గత బడ్జెట్‌కంటే అధికంగా నిధులను ప్రతిపాదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మూడు ప్రాజెక్టులకూ కలిపి రూ.2500 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్ పద్దుల్లో చూపించారు. హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ఏర్పడినప్పటి నుంచి ఇవే అత్యధిక కేటాయింపులు. నష్టాల్లో ఉన్న హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్ఎల్)కు రూ.1500 కోట్లు, పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభించేందుకు రూ.500 కోట్లు, విమానాశ్రయ మెట్రో (హెచ్ఏఎంఎల్)కు రూ.500 కోట్లను ఇవ్వాలని నిర్ణయించారు. గత బడ్జెట్‌లో ఈ మూడు ప్రాజెక్టులకు రూ.2377.35 కోట్లను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.



### విమానాశ్రయ మెట్రో...

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కి.మీ. మెట్రో మార్గానికి 2 నెలల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. దీనికి ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్ల కేటాయింపుతో టెండర్లు పిలిచి పనులు మొదలెట్టే అవకాశం ఉంది.

### పాతబస్తీ మెట్రో...

మెట్రో తొలిదశలో అలైన్‌మెంట్ వివాదాలతో ఆగిన ఎంజీబీఎస్-ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మెట్రోకు ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. పనులు పూర్తి చేయడానికి రూ.2 వేల కోట్ల దాకా అవుతుందని అంచనా. గత బడ్జెట్‌లోనూ రూ.500 కోట్లు కేటాయించినా నిధులు మంజూరు కాలేదు.

### హైదరాబాద్ మెట్రోరైలు సంస్థకు..

మెట్రో తొలిదశ 69.2 కి.మీ. ప్రాజెక్టును తమ సొంత నిధులతో ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సంస్థ నిర్మించి నిర్వహిస్తోంది. దీనికి ఈ బడ్జెట్‌లో రూ.1,500 కోట్లను ప్రతిపాదించారు.

## శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)

| శాఖ | కేటాయింపులు | | |
|---|---|---|---|
| ఆర్థిక | 49,749 | రెవెన్యూ | 3,560 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 31,426 | ఆహార పౌరసరఫరాల సంస్థ | 3,117 |
| నీటిపారుదల | 26,885 | ఉన్నత విద్య | 3,001 |
| వ్యవసాయం, సహకారం | 26,831 | మైనార్టీ సంక్షేమం | 2,200 |
| రోడ్లు-భవనాలు | 22,260 | మహిళా, శిశు సంక్షేమం | |
| షెడ్యూల్డు కులాల అభివృద్ధి | 21,022 | సీనియర్ సిటిజన్స్ | 2,131 |
| ప్రాథమిక విద్య- సెక్రటేరియట్ | 16,092 | పశు సంవర్థక-మత్స్యశాఖ | 2,071 |
| విద్యుత్ | 12,727 | న్యాయశాఖ | 1665 |
| వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ | 12,161 | రవాణా శాఖ | 1644 |
| ప్రణాళిక విభాగం | 11,495 | సాధారణ పరిపాలన శాఖ | 1491 |
| పురపాలన, పట్టణాభివృద్ధి | 11,372 | పర్యావరణ-అటవీ-సాంకేతికత | 1471 |
| హోం శాఖ | 9,599 | యువత, పర్యాటక, సాంస్కృతిక | 1117 |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | 6,229 | కార్మిక, ఉపాధి కల్పన | 542 |
| పరిశ్రమలు-వాణిజ్యం | 4,037 | ఐటీ-కమ్యూనికేషన్స్ | 366 |
| | | లెజిస్లేచర్ | 168 |
| గిరిజన సంక్షేమం | 3,965 | **మొత్తం** | **2,90,396** |